సాక్షి
ఏలూరు

సోమవారం । 15 । జనవరి । 2024



పందెం కో'ఢీ'

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంప్రదాయ కోడిపందేలు జరిగాయి. IIలో



నేటి నుంచి బాస్కెట్‌బాల్ టోర్నీ

నూజివీడులో నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు సర్వం సిద్ధమైంది. IIలో



శ్రీవారికి భోగి ఉత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్నకు భోగి ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవారు ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి అట్టహాసంగా ఊరేగారు.

న్యూస్‌రీల్

సంక్రాంతి వెలుగులు నింపాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో) : సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా సిరిసంపదలు కురిపించాలని, వెలుగులు నింపాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

అందరి ఇంటా ఈ సంక్రాంతి భోగభాగ్యాలతో కలల పంట పండించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

175 సీట్లూ గెలవబోతున్నాం

ఎంపీ కోటగిరి శ్రీధర్



ఉంగుటూరు : రాష్ట్రంలోని 175 సీట్లు గెలవడానికి సీఎం జగన్ బాటలు వేశారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేశారని, ఈ ఫలితం పోలింగ్ కేంద్రాల్లో ఫలితాల ద్వారా కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని సీట్లను వైఎస్సార్‌సీపీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నారాయణపురం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ, వ్యక్తిగత కారణాల వల్ల తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నానన్నారు. పార్టీని గెలిపించేందుకు, ఈ ప్రాంత అభివృద్ధికి తానెప్పుడూ పని చేస్తానన్నారు. తాను ఎమ్మెల్యేగా రావడం కోసం ఎంపీ స్థానాన్ని వదలలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పండుగ కానుక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్రాంతి పండుగ కానుక ఇచ్చారని వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతోకాలంగా నిలిచిపోయిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ బకాయిలు, సరెండర్ లీవులు మంజూరు చేసి ఉద్యోగులకు శుభవార్త చెప్పారని పేర్కొన్నారు. సీఎం జగన్ మాటతప్పని, మడమ తిప్పని నైజం మరోసారి నిరూపించుకుంటూ జనవరిలో బకాయిలు చెల్లిస్తామని ముందుగా ప్రకటించినట్లుగానే బకాయిలన్నీ క్లియర్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మరోసారి తాను ఉద్యోగుల పక్షపాతినని నిరూపించుకున్నారని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఉద్యోగులంతా మరోసారి జగన్‌ని ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమం

నరసాపురం: స్వచ్ఛభారత్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నరసాపురం మున్సిపాలిటీ రాష్ట్రంలోనే 9వ ర్యాంకు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. అలాగే జాతీయ స్థాయిలో 1,066 స్థానంలో నిలిచింది. నాలుగేళ్లగా మున్సిపాలిటీలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారు. అలాగే ఇటీవల కమిషనర్‌గా వచ్చిన కె.వెంకటేశ్వరరావు మున్సిపల్ పాలనలో సంస్కరణలు తీసుకువచ్చారు. ఫలితంగా ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ సర్టిఫికెట్‌ను మున్సిపాలిటీ సాధించింది.



గంగిరెద్దుల గణగణలు.. ఏలూరులో దూడూ బసవన్నల విన్యాసాలు



సంతోషాల రంగవల్లులు.. దెందులూరులో ముగ్గులు వేస్తున్న అమ్మాయిలు

అనుబంధాల మాలిక..
సంక్రాంతి వేడుక

భోగిమంటల భగభగలు.. గంగిరెద్దుల గణగణలు.. **పిండి వంటల ఘుమఘు**మలు.. పిల్లాపాపల **కేరింతలు.. రంగవల్లుల** మాలికలు.. బంధుమిత్రుల **ఆత్మీయ పలకరింపులు..** అంతటా మెరిసే.. మురిసే **సం'క్రాంతులు'. జిల్లావ్యాప్తంగా** సంక్రాంతి **వేడుకలు ఆనందోత్సాహా**లతో మొదలయ్యాయి. **ఊరూవాడా భోగి ఉత్స**వాలు ఘనంగా జరిగాయి.

వై'భోగి'ంగా..

- ఊరూవాడా సం'క్రాంతులు'
- జిల్లాలో పెద్ద పండుగ కోలాహలం
- ఉత్సాహంగా భోగి వేడుకలు
- బంధుమిత్రులతో కళకళ
- కోడిపందేల జోరు



'భోగి'భాగ్యాలు.. దెందులూరులో భోగిమంటల వద్ద పూజలు చేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



జంగమ దొర

దెందులూరు: జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. ఎక్కడ చూసినా రంగవల్లులు, ఆటల పోటీలతో హడావుడి, కోడిపందాల జోరు కనిపిస్తోంది. ఆదివారం భోగివేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఊరూరా భోగిమంటల సందడి కనిపించింది. దెందులూరు 10వ వార్డులో శ్రీరామదండు దెందులూరు మండల కమిటీ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఇంద్రవనంలో జీవ వైవిధ్య విధానంలో, గ్రామదీప్ నిర్వాహకులు వెలమాటి మనోహరి ఆధ్వర్యంలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరయ్యారు. పల్లెలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు వేదికలు అని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. పట్టణాలు, ఇతర రాష్ట్ర, దేశాల్లోని తెలుగు వారు ఇక్కడకు రావడం, తాము ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సనాతన భారతీయ ఇతిహాస సంప్రదాయాలు, సంస్కృతికి పండుగలు ప్రతిబింబాలన్నారు. సంప్రదాయాలకు దర్పణం పట్టేలా ఇక్కడ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

చిన్నారులకు బహుమతులు

వేదమంత్రోచ్ఛరణలతో అగ్నిస్థాపన నిర్వహించి తొలుత భోగిమంటను వెలిగించారు. గంగిరెద్దులు, జంగమ దేవరలు, హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. మహిళలు పొంగలి, పాయసం వండారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరైన 300 మందికి బహుమతులు అందజేశారు. పురాతన వస్తువులు, దేశాల జెండాలను ప్రత్యేక స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఇంద్రవనంలో ఇల్లు సెట్టింగ్, భోగి మంటలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. మొటపర్తి రాజా దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తొత్తడి వేదుకుమారి, పోకల రాంబాబు, కొలుసు గణపతిరావు, సంపంగి రామ్‌గోపాల్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త కాంతులు నింపేలా..



దోలు వాయిస్తూ సందడి



పొంగలి వండుతున్న మహిళలు



కైకలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజు, ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి

భోగి వేడుకల్లో ఎమ్మెల్యేలు

కైకలూరు/బుట్టాయగూడెం : కైకలూరులోని నివాసం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) భోగి మంట వెలిగించారు. కుటుంబసభ్యులతో కలిసి భోగి వేడుకలు జరుపుకున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకోగా.. కళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు. అలాగే బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో సంక్రాంతి సంబరాల్లో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. భోగిమంటల చుట్టూ గిరిజన మహిళలతో కలిసి కోలాట నృత్యం చేశారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో గోదా, రంగనాథుల కల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యార్జిత కల్యాణంతో పాటు గోదాదేవిని ఉంచి కల్యాణ తంతును నిర్వహించారు. సుముహూర్త సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. భక్తుల గోవిందనామ స్మరణలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కనుమ ఉత్సవానికి సర్వం సిద్ధం

ద్వారకాతిరుమల: శ్రీవారి కనుమ ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 16న మండలంలోని దొరసానిపాడులోని కనుమ మండపంలో ఉత్సవాన్ని దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఈ మేరకు ఇప్పటికే కనుమ మండపాన్ని సుందరీకరించారు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు కనుమ నాడు స్వామి, ఉభయ దేవేరులతో కలిసి దొరసానిపాడు గ్రామానికి అట్టహాసంగా వెళతారు. ఏడాదికోమారు తమ గ్రామానికి విచ్చేసే స్వామివారి ఆగమనం కోసం గ్రామస్తులు నియమనిష్ఠలతో, భక్తిప్రపత్తులతో నిరీక్షిస్తారు. కనుమ రోజు మండపంలోని స్వామివారిని ఆశీనులు గావించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు గిరిప్రదక్షిణగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.



దొరసానిపాడులో కనుమ మండపం



క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ

రూ.3.85 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల అపహరణ

ముసునూరు: గోపవరంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగి రూ.3.85 లక్షల విలువైన బంగారపు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపవరంలో పుట్టా నాగార్జున కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మొక్కుబడి చెల్లించుకునేందుకు ద్వారకాతిరుమల వెళ్లారు. ఆదివారం సాయంత్రం ద్వారకాతిరుమల నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. అయితే తలుపులు తెరిచి ఉండటాన్ని చూసి కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా, బంగారపు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పందెం కోడీ

పూర్వ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం పలు చోట్ల సంప్రదాయ కోడిపందేలు నిర్వహించారు. భోగి రోజు తెల్లవారుజాము నుంచే పందేలను ప్రారంభించారు. కొన్ని చోట్ల భారీగా ఏర్పాట్లు చేసిన బరుల్లో ఎక్కువగా పందేలను గెలిచిన విజేతలకు బుల్లెట్ వంటి ద్విచక్రవాహనాలను బహుమతులుగా అందించడం విశేషం. అలాగే పందేలను తిలకించేందుకు వచ్చిన వారితో బరుల వద్ద కోలాహలం నెలకొంది. – సాక్షి, నెట్‌వర్క్


భీమడోలు: గుండుగొలను బరిలో ఢీకొంటున్న పందెం కోళ్లు


తలపడుతున్న కోళ్లు


భీమవరం అర్బన్: యనమదుర్రులో జోరుగా..


ఉంగుటూరు: పందెం విజేతకు బహుమతిగా బైక్‌లు రెడీ


భీమడోలు: గుండుగొలను బరిలో తలపడుతున్న కోళ్లు


భీమడోలు: గుండుగొలనులో భారీగా నిర్వహిస్తున్న కోడిపందేలు


ఏలూరు రూరల్: కొమడవోలులో కోలాహలంగా..

కోడి పందేలపై మెరుపు దాడులు

ముసునూరు: గోపవరం, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లో రహస్యంగా జరుగుతున్న కోడిపందేలు, పేకాట శిబిరాలపై సిబ్బందితో కలిసి మెరుపు దాడులు చేసి తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు ఆదివారం చెప్పారు. వారి నుంచి రూ.27,355 నగదు, రెండు కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. నిందితులను బుధవారం నూజివీడు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

కోడిపందేలకు వెళ్లి.. వ్యక్తి మృతి

కామవరపుకోట: ఆడమిల్లిలో కోడిపందేలు ఆడేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా ఆడమిల్లి గ్రామ శివారులో ఓ పామాయిల్ తోటలో శనివారం రాత్రి కోడి పందేలు ఆడేందుకు అదే గ్రామానికి చెందిన మిడత శ్రీనివాసరావు (49) వెళ్లాడు. అయితే పందేల సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసేందుకు వస్తూ సైరన్ మోగించారు. దీంతో శ్రీనివాసరావు పరిగెడుతూ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావుకు గతంలో ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ టోర్నీ

- నూజివీడు డీఏఆర్ కళాశాలలో జాతీయ పోటీలకు ఏర్పాట్లు పూర్తి
- 47 ఏళ్లుగా అక్రో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- తలపడనున్న 37 పురుష, మహిళల జట్లు.. ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలు

బాస్కెట్‌బాల్ క్రీడా సంబరానికి నూజివీడు డీఏఆర్ కళాశాల వేదిక నిలుస్తోంది. అక్రో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 47 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ఈ ఏడాది మొత్తం 37 జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల నిర్వహణకు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 20 మంది రిఫరీలు రానున్నారు.

నూజివీడు: పట్టణంలో ధర్మ అప్పారావు (డీఏఆర్) కళాశాల క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఈ నెల 15 నుంచి నాలుగురోజుల పాటు జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు క్రీడాభిమానులకు కనువిందు చేయనున్నాయి. పురుషులు, మహిళ విభాగంలో జరిగే పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశాఖపట్టణం, హైదరాబాద్, అనంతపురం, నెల్లూరు, వరంగల్ తదితర నగరాలకు చెందిన ప్రముఖ జట్లతో పాటు చత్తీస్‌గఢ్ నుంచి మొత్తం 37 జట్లు తమ ఎంట్రీలను ఇప్పటికే నమోదు చేసుకున్నాయి. పురుషుల విభాగంలో 23 జట్లు, మహిళల విభాగంలో 14 జట్లు పాల్గొననున్నాయి. 47 ఏళ్లుగా ఈ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను నిరివ్రామంగా నిర్వహిస్తూ రాష్ట్రంలో నూజివీడు ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. పోటీల నిర్వహణకు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 20 మంది రిఫరీలు రానున్నారు. పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానుల విరాళాలతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల కోసం కళాశాల ప్రాంగణంలోని రెండు బాస్కెట్‌బాల్ కోర్టులను సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి, పగలు కూడా పోటీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


పోటీలకు సిద్ధం చేసిన బాస్కెట్‌బాల్ కోర్టులు


ప్రేక్షకులు తిలకించేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు

ఇదీ నేపథ్యం

మాజీ మంత్రి, ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి, మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ ఎమ్మార్ అప్పారావు అధ్యక్షునిగా, ఎంఎస్ అప్పారావు కార్యదర్శిగా 1969లో మొట్టమొదటిసారిగా నూజివీడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆవిర్భవించింది. అనంతరం 1971లో తొలిసారిగా డీఏఆర్ కళాశాలలో ఆంధ్రా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. 1973లో ఎంఎస్ అప్పారావు సారథ్యంలో ఆక్రో బాస్కెట్‌బాల్ సంఘం ఏర్పాటైంది. 1975లో చిత్తూరులో జరిగిన ఆంధ్రా చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల, మహిళ విభాగాల్లో నూజివీడు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. అప్పటి నుంచి నూజివీడులో బాస్కెట్‌బాల్‌కు ఆదరణ మరింత పెరిగి దినదిన ప్రవర్ధమానమైంది. ఈ క్రీడను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మార్ అప్పారావు నేతృత్వంలో నూజివీడు కేంద్రంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటైంది. డీఏఆర్ కళాశాలలో మట్టి కోర్టులో గేమ్ నేర్చుకున్న ఎందరో క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి నూజివీడుకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు. మరెందరో క్రీడాకారులు పీఈటీలుగా, పీడీలుగా స్థిరపడ్డారు. దూరప్రాంతాలలో ఉద్యోగాలలో స్థిరపడిన ఎందరో సంక్రాంతికి పోటీలను తిలకించేందుకు వచ్చి పాతరోజులను గుర్తుకు తెచ్చుకుని ఉత్సాహంగా గడుపుతారు.

శ్రీవారి కొండపై అట్టహాసంగా సంబరాలు


శ్రీవారి కొండపై భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఈఓ త్రినాథరావు


డూడూ బసవన్నల విన్యాసాలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే తలారి, ఈఓ త్రినాథరావు, భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని ఆలయ తూర్పు ప్రాంతంలో సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు శ్రీవారి చిత్రపటానికి పూజలు జరిపి, భోగి మంటను వెలిగించి, సంబరాలను ప్రారంభించారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పూరి గుడిసె, ఎడ్ల బళ్లు, అశ్వాలు, కోడిపుంజులు, కళాకారుల విన్యాసాలు, కోలాట భజనలతో ఆ ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. అలాగే గజలక్ష్మి సందడి చేసింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పులి, బుడబుక్కలు తదితర వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయాలను కళ్లకు కట్టినట్టుగా క్షేత్రంలో ఈ వేడుకలను జరపడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సంబరాల్లో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, పాలా వెంకటేశ్వరరావు, వాసే రామకృష్ణ, చిట్టూరి మణి, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, భోగరాజు సాయికృష్ణ, గుర్రాల లక్ష్మణ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే నిమ్మలపై అనర్హత వేటు వేయాలి

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డుపడుతున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించే కార్యక్రమంలో మైక్ ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే చేసిన రభస సరికాదన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడమే ఎమ్మెల్యే నిమ్మల ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి మంచిపేరు రావడం ఆయనకు ఇష్టం ఉండదన్నారు. ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే రామానాయుడికి ఓటమి భయం పట్టుకుని అభద్రతాభావానికి లోనవుతున్నారన్నారు. దళిత నాయకులను, దళిత అధికారులను అవమానించే రీతిలో ఎమ్మెల్యే ప్రవర్తిస్తున్నారన్నారు. తన మాట వినని అధికారులపై కోర్టు కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును వెంటనే భర్తరఫ్ చేయాలని ఆనందప్రకాష్ డిమాండ్ చేశారు.

కారులో నగదు బ్యాగ్ చోరీ

కాళ్ల: కారులో నగదు బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదఅమిరంలో ఎంపీ రఘురామకృష్ణంరాజును కలిసేందుకు పెనుమంట్ర మండలం ఆలమూరుకు చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు ఆదివారం కారులో వచ్చారు. లోపలికి వెళ్లి ఎంపీని కలిసి బయటికి రాగా అప్పటికే తన కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న బ్లూ కలర్ బ్యాగును అపహరించారన్నారు. ఈ బ్యాగులో సుమారు రూ.2 లక్షల నగదు ఉన్నట్లు తెలిపారు. శ్రీనివాసరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.